సాక్షి తిరుపతి

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



లారీని ఢీకొన్న 108

దొరవారిసత్రం వద్ద జాతీయ రహదారిపై 108 వాహనం లారీని ఢీకొనడంతో ఇద్దరు రోగులకు గాయాలయ్యాయి. - 8లో



మహిళ ఆకస్మిక మృతి

నాయుడుపేటలోని తుమ్మూరుకు చెందిన ఓ మహిళ ఆకస్మికంగా మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. - 8లో



వాహనం దగ్ధం

ప్రమాదవశాత్తు టాటా మ్యాజిక్ వాహనం దగ్ధమైన ఘటన డక్కిలి మండలంలో చోటు చేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనతరం కోటమండపం వద్ద మూడు ప్రదక్షిణలు చేసి అక్కడ స్వామి,అమ్మవార్లకు విశేష నైవేద్యం, మంత్ర పుష్పం, దీపారాధన, హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్లకు సర్వం సిద్ధం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టానికి సమయం ఆసన్నమైంది. గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

తిరుపతి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ మేరకు కసరత్తు చేస్తున్నారు. ఉదయం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల తర్వాత ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

తిరుపతి అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరుపతి పార్లమెంట్‌కు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సర్వేపల్లి (నెల్లూరు జిల్లా) అసెంబ్లీ నియోజకవర్గాలకు– జనరల్ అబ్జర్వర్ – కరే గౌడను నియమించినట్లు వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గానికి – కైలాష్ వాంఖడే, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడుకు– ఉజ్వల్ కుమార్ గోష్‌ను నియమించారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎక్స్పెండిచర్ అబ్జర్వర్‌గా ప్రదీప్‌కుమార్‌ను ఏర్పాటు చేశారు. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు ఎక్స్పెండిచర్ అబ్జర్వర్‌గా వీజీ.శేషాద్రిని నియమించారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎక్స్పెండిచర్ అబ్జర్వర్‌గా మీను ఓలన నియమించారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సర్వేపల్లి (నెల్లూరు) అసెంబ్లీ నియోజకవర్గాలకు – పోలీస్ అబ్జర్వర్ అరవింద్ హెచ్ సాల్వేను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

వెంకటగిరి రూరల్ : 2024–25 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్షలు ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. 5, 6, 7, 8 తరగతులు, ఏపీఆర్ఎస్ టెట్–2024 లకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఏపీఆర్‌జేసీ, 2024కు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు డీసీ సెట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాబు ఇంతేకదమ్మ!

బీసీ సామాజికవర్గాన్ని చంద్రబాబు కరివేపాకులా వాడుకుని వదిలేస్తున్నారని ఆ సామాజిక వర్గం నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తమకు మొండిచెయ్యే చూపుతున్నారని రగిలిపోతున్నారు. టీడీపీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కేవలం రెండు సార్లే బీసీలకు సీట్లు ఇవ్వడం చూస్తుంటే తమ సామాజికవర్గంపై బాబుకు ఎంత పగ ఉందో అర్థమవుతోందని పలువురు నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. బీసీలకు మారుపేరుగా ఉన్న కుప్పం నియోజవకార్గన్ని సైతం కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారని చర్చించుకుంటున్నారు. ఈ సారి ఎన్నికల్లోనూ తన కుటిల బుద్ధి చూపి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తన సామాజిక వర్గానికి నాలుగు సీట్లు కట్టబెట్టి.. తమకు ఒక్క సీటూ ఇవ్వలేదని లోలోపలే రగిలిపోతున్నారు. ఈ ఎన్నికల్లో బాబును ఓడించి తీరుతామని పలువురు నేతలు తెగేసి చెబుతున్నారు.



- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీలకు ఒక్కసీటూ ఇవ్వని కపట కూటమి
- కుప్పం, నగరి, తిరుపతి, వెంకటగిరి, పలమనేరు కోసం బీసీ నేతల ప్రయత్నం
- బాబు సామాజిక వర్గానికే నాలుగు టికెట్లు
- టీడీపీని నమ్ముకున్నా బీసీలను పట్టించుకోని చంద్రబాబు
- టీడీపీకి దూరంగా ఉండాలని నిర్ణయం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 33,59,457 మంది బీసీలు ఉన్నారు. ఇందులో బీసీ ఓటర్లే సుమారు 11 లక్షలు. ఓసీ ఓటర్లు సుమారు 8 లక్షలు ఉండొచ్చని అధికారులు చెబుతున్న లెక్కలు. ఇంత పెద్ద మొత్తంలో ఓటర్లు ఉన్న బీసీ సామాజిక వర్గానికి టీడీపీ కానీ జనసేన, బీజేపీ ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అదే చంద్రబాబు సామాజికవర్గానికి మాత్రం ఏకంగా నాలుగు సీట్లు కేటాయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఇద్దరు బీసీ సామాజికవర్గం వారికి టికెట్లు ఇచ్చి వారి పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంది. ఆ ఇద్దరిలో చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా భరత్‌కృష్ణ ఒకరైతే.. పలమనేరు నియోజకవర్గానికి వెంకటేగౌడ్‌కి టికెట్ ఇచ్చి బీసీలను గౌరవించింది.

మూడున్నర దశాబ్దాలుగా బీసీలకు అన్యాయం

బీసీలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కుప్పం మొదటిది. అటువంటి కుప్పం నియోజకవర్గాన్ని ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. గత 35 ఏళ్లుగా కుప్పంలో బీసీలకు ఎమ్మెల్యే పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారు. బీసీల అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో మలచుకుంటూ బీసీలను దగా చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఉంటే.. అందులో 23.29 శాతం ఓట్లు వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం వారివే. టీడీపీ పుట్టినప్పటి నుంచి కేవలం వెయ్యి ఓట్లు కూడా లేని కమ్మ సామాజికవర్గం కుప్పాన్ని ఆక్రమించుకుని బీసీలను అణగదొక్కుతూ వస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టినప్పటి నుంచి కుప్పంలో బీసీలకే పెద్దపీట వేస్తూ వస్తోంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన భరత్‌కృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బీసీలను గౌరవించింది. సీఎంగా, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హైదరాబాద్, అమరావతికే పరిమితమైనా.. కుప్పంలో పెత్తనం కూడా కమ్మ సామాజిక వర్గం వారికే అప్పగించారు. టీడీపీ పురుడు పోసుకున్నప్పటి నుంచి కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకే ఒక సారి శ్రీకాళహస్తి, పుంగనూరు అసెంబ్లీ స్థానాలకు బీసీ అభ్యర్థులను బరిలోకి దింపింది. అంతకుమించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ బీసీలకు టికెట్లు ఇచ్చి గౌరవించిన దాఖలాలు లేనే లేవు.

బాబు కులస్తులకే పెద్దపీట

కుప్పం మొదలు.. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన సామాజిక వర్గానికే చంద్రబాబు పెద్దపీట వేస్తూ వచ్చారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ అభ్యర్థులను పరిశీలిస్తే.. కుప్పం అభ్యర్థిగా చంద్రబాబు, చిత్తూరు అభ్యర్థిగా గురజాల జగన్మోహన్ (కమ్మ), నగరి నుంచి గాలి భానుప్రకాష్ (కమ్మ), వెంకటగిరి అభ్యర్థిగా లక్ష్మీసాయి ప్రియ (కమ్మ) వారిని చంద్రబాబు ప్రకటించారు. కుప్పం, పలమనేరు, చిత్తూరు, తిరుపతి, నగరి, వెంకటగిరి నియోజక వర్గాల నుంచి బీసీలు టీడీపీ టికెట్ ఆశించినా చంద్రబాబు కనీసం పరిగణలోకి కూడా తీసుకోలేదు. టీడీపీ పుట్టినప్పటి నుంచి జెండా మోస్తున్న నరసింహయాదవ్ (తిరుపతి) టికెట్ కోసం ప్రతి సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రయత్నించినా చంద్రబాబు కరుణించిన దాఖలాలు లేవు. నగరి టికెట్ కోసం మొదలియార్లు, వెంకటగిరి అసెంబ్లీ కోసం చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు టీడీపీ టికెట్ ఆశించినా చంద్రబాబు పట్టించుకోకపోగా ఆయన సామాజికవర్గం వారికే కట్టబెట్టి ×కమ్మ×టి ప్రేమను చాటుకుంటూ వస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఓటు బ్యాంకింగ్‌గా మార్చుకుంటూ పబ్బంగడుపుకుని వదిలేస్తున్న చంద్రబాబుకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి తీరుతామని బీసీ ఓటర్లు స్పష్టం చేస్తున్నారు.

'కష్టాల్లో పెరిగా.. ఏదైనా ఇష్టంతోనే చేస్తా' అంటున్నారు.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి. అందుకే ఆయన ఎక్కడ ఎవరికి కష్టమొస్తే అక్కడ వాలిపోతుంటారు. పేదల పెద్దన్నగా పేరు గడించారు. కరోనా కష్టకాలంలో నేనున్నానంటూ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచారు. చిరు వ్యాపారులు, దివ్యాంగులకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. ప్రజలకు సేవచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. నిత్యం జనంలోనే ఉంటూ.. జనంతోనే జీవిస్తూ నిస్వార్థ సేవకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలను స్ఫూర్తిగా తీసుకుని 'మదన్న నవరత్నాలు' పేరుతో సొంత అజెండాను సిద్ధం చేసుకున్నారు. ఇందులో చిరు వ్యాపారులకు తోడుగా నిలవడం, కుల వృత్తులను ప్రోత్సహించడం, విద్యకు సాయం చేయడం, ముస్లిం మైనారిటీల పెళ్లికి మేనమామ సాంగ్యం అందించడం, కుటుంబ పెద్ద మృతి చెందితే ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలవడం, దివ్యాంగులకు వీల్ చైర్లు అందించడం, హ్యాండీక్రాఫ్ట్‌కు తోడ్పాటు అందించడం, పేదలకు అన్నదానం, సాగుకు నీరందించి అన్నదాతను వెన్నుతట్టి ప్రోత్సహించడం.. వంటి విశిష్ట కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. అభాగ్యులకు ఆపన్నహస్తం అందిస్తూ జేజేలు అందుకుంటున్నారు. సొంత నిధులు వెచ్చించి బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేపట్టిన సేవలపై ప్రజల స్పందన వారి మాటల్లోనే.. - శ్రీకాళహస్తి



పంపిణీకి సిద్ధం చేసిన తోపుడు బండ్ల వద్ద ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి(ఫైల్)

ప్రజల జవసత్వాలు.. మదన్న నవరత్నాలు!

పేదల పెద్దన్నగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- కష్టకాలంలో నేనున్నానంటూ భరోసా
- సరస్వతీపుత్రులకు తోడూనీడ ఆయనే
- సొంత నిధులతో చిరువ్యాపారులకు సాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న శ్రీకాళహస్తి వాసులు

మదన్న దయతోనే జీవిస్తున్నా



నేను రోడ్డు మీద ఏ దిక్కూ లేకుండా బుట్టలో పండ్లు పెట్టుకుని బజారులో తిరుగుతూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేదాన్ని. సాయంత్రం ఇంటికి వస్తే తల, నడుము నొప్పితో చాలా ఇబ్బంది పడేదాన్ని. సంపాదించిన డబ్బు ఆస్పత్రికే సరిపోయేది. ఇలాంటి తరుణంలో ఎమ్మెల్యే మదన్న చిరు వ్యాపారులకు ఇచ్చిన సాయం ఎంతో ఉపయోగపడింది. ముఖ్యమంత్రి జగనన్న పుట్టినరోజు సొంత డబ్బులు పెట్టి నాకు తోపుడు బండి ఇచ్చారు. నా జీవితం మారింది. ఏ కష్టం లేకుండా బండిలో వ్యాపారం చేసుకుంటున్నాను. - పుష్పమ్మ ,భాస్కర్ పేట

సొంత మేనమామ లాగే!



చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే మాకు లక్షల రూపాయలు వెచ్చించి పెళ్లిళ్లు చేసుకోలేని సందర్భంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మేనమామ లాగా ముందుకొస్తున్నారు. పెళ్లి అని తెలిస్తే చాలు.. ఆయన అన్నీ దగ్గరుండి సమకూర్చుతున్నారు. ముస్లిం మైనార్టీలు ఎవరి పెళ్లి జరిగినా వారికి మేనమామ లాగా వెన్నంటే ఉంటున్నారు. నా కుమార్తె పెళ్లికి మంచము, బీరువా, టీవీ, ఫ్రిడ్జిని తన సొంత నిధులతో ఇచ్చి ఆదుకుంటున్నారు. - సయ్యద్ చౌలాలి, జాస్మి, తుపాన్‌సెంటర్, శ్రీకాళహస్తి



విద్యార్థులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ముస్లిం దంపతులకు మేనమామ సాంగ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆయన లాగా సేవ చేయాలని ఉంది



పేదలకు సేవ చేయడంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయనకు ఆయనే సాటి. నేను అమెరికాలో ఎమ్మెస్సీ చేయడానికి వెళ్లాలనుకున్నా. చేతిలో చిల్లిగవ్వలేదు. తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎమ్మెల్యే మదన్న లక్ష రూపాయలు, విమాన టిక్కెట్లు అందించారు. విదేశాల్లో చదువుకోవడానికి అవకాశం కల్పించారు. ఆయన మేలు ఎప్పటికీ మర్చిపోలేను. నేను చదువుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మదన్న స్ఫూర్తిగా ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని ఉంది. విద్యకు ఆయన ఇచ్చే విలువ అంతాఇంతా కాదు. - కృష్ణమనాయుడు, బ్రాహ్మణపల్లె, తొట్టంబేడు మండలం

బయట ప్రపంచం చూశా



నా కాలు ఒకటి పనిచేయకుండా ఇంట్లోనే ఉండాల్సి వచ్చింది. బయటికి వెళ్లాలంటే మనిషి సాయం లేకుండా కదలలేని పరిస్థితి ఉండేది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి సాయమడిగాను. ఆయన వెంటనే స్పందించారు. బ్యాటరీ ట్రై సైకిల్ బండి ఇచ్చారు. దాని వల్ల ఈరోజు నేను బయట తిరగగలుగుతున్నాను. మదన్న నాకు దేవుడితో సమానం. ఆయన రుణం తీర్చుకోలేను. - సుబ్బమ్మ, రాజీవ్‌నగర్, శ్రీకాళహస్తి

తండ్రి లాగా ఆదుకున్నారు

ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడ్డాం. మా నాన్న రామ్మూర్తి ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తూ అనేక మందికి సాయం చేశారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత నాకు చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిశాము. ఉదారంగా రూ.50 వేల ఇచ్చారు. నేను చదువుకుంటున్నాను అంటే ఆయన సాయమే. దీన్ని ఎప్పటికీ మరువలేను. - అను, ఏర్పేడు

హ్యాండీ క్రాఫ్ట్‌కు బ్రాండ్ అంబాసిడర్



శ్రీకాళహీస్తీశ్వరాలయానికి ముఖ్యమైన వారు ఎవరు వచ్చినా వారిని కలంకారి శాలువతో సన్మానిస్తారు. కొయ్య బొమ్మలను బహూకరిస్తారు. ఈ విధంగా మదన్న హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. నాకు కలంకారీ షెడ్డుకు అవసరమైన మూడు సెంట్లు భూమి ఇప్పించారు. ఉపాధి కల్పించేందుకు సాయం చేశారు. -వెంకటేశ్వర్లు, కలంకారి కళాకారుడు, తొట్టంబేడు

● నవమి సంబరం



తిరుమలలో బుధవారం శ్రీరామనవమి ఆస్థానాన్ని పురస్కరించుకుని హనుమంత వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగుతున్న శ్రీరాములవారు. - తిరుమల

కల్యాణం..వైభోగం

- తుమ్మలగుంటలో వేడుకగా శ్రీరామ నవమి వేడుకలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు
- కల్యాణ మహోత్సవానికి తరలి వచ్చిన భక్తులు



విశేష అలంకరణలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి



కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: శ్రీ రామనవమి వేడుకలు బుధవారం తుమ్మలగుంటలో కనులపండువుగా సాగాయి. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి జగదభిరాముని కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించారు. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకుని వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై కొలువు దీర్చారు. విశ్వక్సేనారాధన, గణపతి పూజలతో సీతారాముల కల్యాణం దిగ్విజయంగా కొనసాగింప జేయాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు రక్షాబంధనాలను సీతా, రాముల వారి ముంజేతికి అలంకరింపజేశారు. సుముహూర్తం ప్రారంభం కాగానే అర్చకులు అమ్మవారి, స్వామి వారి తలలపై జీలకర్ర, బెల్లంతో అలంకరించారు. అనంతరం మంగళసూత్రాన్ని భక్తులకు దర్శింపజేసి రాములవారి చేతులకు తాకించి సీతాదేవి మెడలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు జయ జయధ్వానాలు పలుకగా ముత్యాల తలంబ్రాలను సీతారాముల తలలపై పోసి కల్యాణ తంతు ముగించారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు.



మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకులు



భక్తులకు తలంబ్రాలను అందిస్తున్న అర్చకులు

పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి దంపతులు

శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు కల్యాణ వెంకన్నకు పట్టువస్త్రాలు సమర్పించారు. తల్లిదండ్రులతో పాటు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వేదికపైకి చేరుకుని వివాహ మహోత్సవాన్ని తిలకించారు.

భక్తులకు పెళ్లి విందు

శ్రీ సీతారాముల కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులందరికీ ఆలయం వద్ద భోజనం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు స్వయంగా వడ్డించగా భక్తితో స్వీకరించారు. అంతకు ముందు శ్రీ సీతారాముల కల్యాణంలో ఉపయోగించిన తలంబ్రాలను భక్తులకు ఆలయ అర్చకులు అందించారు.

క్లుప్తంగా

లారీని ఢీకొన్న 108 అంబులెన్స్

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి 108 అంబులెన్స్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటన దొరవారిసత్రం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. డీవీసత్రానికి చెందిన 108 అంబులెన్స్ ఉచ్చూరు గ్రామానికి చెందిన డయాలసిస్ రోగులను ఎక్కించుకుని నెల్లూరుకు వెళ్లే క్రమంలో దొరవారిసత్రం గ్రామ సమీపం వద్ద ముందు వెళ్లే ఓ లారీని అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న ఇద్దరు రోగులకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు పోలయ్య

తడ: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా.. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. ఎస్ఐ పీ.నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక నిప్పో పరిశ్రమలో వంట మాస్టరుగా పని చేస్తున్న తడకండ్రిగ పంచాయతీ, అగ్రహారం గ్రామానికి చెందిన ఎల్లా పోలయ్య(44) విందులకు హాజరయ్యేందుకు అదే పరిశ్రమలో క్యాంటీన్ సూపర్‌వైజర్ మోటిరెడ్డి చైతన్య బైక్‌పై బయలు దేరాడు. బ్యాంక్ అకౌంట్ బుక్ తెస్తున్న తన తండ్రి ఎల్లా చెల్లయ్య కోసం బైక్‌ని బీవీ ల్‌పాడు గ్రామం వద్ద ఉన్న శివాలయం సమీపంలో, రోడ్డు మార్జిన్ పక్కన నిలిపారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి తడ మండలంలోని సెల్వ కుప్పానికి వెళుతున్న టాటాఏస్ వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో బైక్ వెనుక కూర్చుని ఉన్న పోలయ్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు శ్రీసిటీలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో చైతన్యకు కూడా తీవ్రగాయాలు కావడంతో వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ సెల్వకుప్పంకి చెందిన శరణ్‌కుమార్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బావిలో దూకి వ్యక్తి మృతి

కోట: బావిలో దూకి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కోట మండలం చంద్రశేఖరపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోటయ్య(37) అనారోగ్యంతో బాధపడుతుండగా.. బుధవారం గ్రామ సమీపంలోని బావిలో దూకి తనువు చాలించాడు.

ప్రతి ఇంటా జగనన్న సంక్షేమమే


42వ డివిజన్‌లో ప్రచారానికి పోటెత్తిన అభిమానులు


42వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- తిరుపతిలో ఓటమి భయంతోనే ఆరోపణలు
- టీడీపీ, జనసేన కూటమి ఎత్తులు చిత్తు చేయడం ఖాయం
- తిరుపతి 42వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: ప్రతి పేదవాడి కళ్లలో ఆనందం, ప్రతి ఇంటా సంక్షేమాన్ని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగించారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 42వ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమం, తిరుపతిలో అభినయ్ చేసిన అభివృద్ధితో టీడీపీ, జనసేన కూటమికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దాంతో తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. మేలు చేయకపోయినా పర్వాలేదు కీడు మాత్రం చేయకూడదన్న జ్ఞానం కూడా టీడీపీ, జనసేన కూటమికి లేదన్నారు. టీటీడీ ఉద్యోగుల పట్ల వారు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు చూస్తుంటే బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీలో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు పరిష్కరించడం ఆ కూటమికి ఇష్టంలేనట్లుందని మండిపడ్డారు. టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం, జీతాలు పెంచడం నేరమా? అని ప్రశ్నించారు. శ్రీవారి భక్తులకు సేవ చేసే భాగ్యం, టీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే అవకాశం లభించినందుకు వారికి సేవ చేస్తున్నానే తప్ప తన స్వలాభం, స్వార్థం కోసం కాదన్నారు. తనపై, తన కుమారుడు అభినయ్‌పై ఆరోపణలు చేస్తే ఓట్లు పడవన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. టిడిపి, జనసేన కూటమి ఎత్తులను తిరుపతి నగర ప్రజలు ఓట్ల రూపంలో చిత్తు చేస్తారన్నారు. కూటమి మాయమాటలు, కులాలను చూసి కాకుండా అభివృద్ధిని చూసి అభినయ్‌కి ఓట్లు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, గోపాల్‌రెడ్డి, కొండ మునిరెడ్డి, ఎంఎస్.సత్య, కంకనాల రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు లడ్డూ భాస్కర్, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, తిరుపతి మునిరామిరెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, వరికుంట్ల నారాయణ, నరేంద్ర, తిరుత్తణి శైలజ, దూదికుమారి, కో–ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, రుద్రరాజు శ్రీదేవి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పార్టీ నాయకులు ఆదం దశరథరామిరెడ్డి (ఏడీఆర్), కొమ్ము చెంచయ్యయాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రవర్తి, పెరుగు బాబూయాదవ్, నాదముని, ప్రమీల పాల్గొన్నారు.

జాగ్రత్త.. సారూ!

నామినేషన్ ఘట్టంలో అభ్యర్థి భవితవ్యం ఓటరు ఎపిక్(ఎలక్టర్స్ ఫొటో ఐడెంటిఫికేషన్ కార్డ్) నంబర్ మీద ఆధారపడి ఉంటుంది. అభ్యర్థి వేసే నామినేషన్ తిరస్కరణకు గురికాకుండా ఉండాలంటే ఓటు జాబితాలోని అభ్యర్థి పేరు, క్రమ సంఖ్య, భాగం సంఖ్య సరిగ్గా ఉండాలి. ఇదే సూత్రం అభ్యర్థులను ప్రతిపాదించేవారికి కూడా వర్తిస్తుంది. అభ్యర్థులు నామినేషన్ పత్రంలో సరైన క్రమ సంఖ్య, భాగం సంఖ్య పూరించాల్సి ఉంటుంది. ఎన్నికల హడావుడిలో పాత ఓటరు కార్డు మీద ఉన్న క్రమసంఖ్యను, భాగం సంఖ్యను పూరిస్తే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు తమ ఓటు హక్కు వివరాలను, ప్రతిపాదించే వారి వివరాలను తెలుసుకోవడానికి ఎపిక్ నంబర్ సాయం తీసుకోవాలి. ఓటరు జాబితాలోని పేజీలను తిరగవేయడం కంటే స్మార్ట్‌ఫోన్‌లోని ఓటర్ సర్వీస్ పోర్టల్‌ను ఆశ్రయిస్తే సరిపోతుంది. ఓటు జాబితాలో జరిగే మార్పులు, చేర్పుల్లో ఓటరు క్రమసంఖ్య మారుతుందే తప్ప ఎపిక్ నంబర్ ఎప్పటికీ మారదు.

–తిరుపతి సిటీ

ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలో ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో రూ.6 లక్షల విలువైన సొత్తు మంగళవారం రాత్రి చోరీకి గురైంది. రూరల్ సీఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం.. స్థానిక దిగువ పద్మశాలి వీధిలో నివాసముంటున్న రూపేష్ శనివారం మధ్యాహ్నం నగరి మున్సిపాలిటీ మాంగాడు గ్రామ జాతర సందర్భంగా తన కుమార్తె ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు వచ్చిన రూపేష్ ఇంటి మెయిన్ గేట్‌కు తాళం వేసి ఉన్న చైన్‌ను ఊడదీసి ఉండడాన్ని గుర్తించాడు. అలాగే ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇందులో సుమారు 65 గ్రాముల బంగారు నగలు, 300 గ్రాముల వెండి ఆభరణాలు, బీరువాలో దాచి ఉంచిన రూ.6 వేల నగదుతో పాటు ఎల్ఈడీ టీవీ చోరీకి గురైనట్లు గుర్తించారు. తిరపతి నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. కేసు దర్యాప్తులో ఉంది.

దివ్య ముహూర్తం.. శుభప్రదం!

- నేటి నుంచి నామినేషన్ల పర్వం
- దివ్య ముహూర్తాల కోసం అభ్యర్థుల సంప్రదింపులు

తిరుపతి సిటీ: సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో కీలక ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు నేటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే రాజకీయ నాయకులు దివ్య ముహూర్తం చూసి నామినేషన్లు దాఖలు చేసేందుకు ఇప్పటికే తమకు నమ్మకమైన, పేరొందిన పురోహితులను, వేద పండితులను, సిద్ధాంతులను సంప్రదించి అయ్య గారూ... నమస్కారం..! అంటూ తేదీలను ఖరారు చేసుకుంటున్నారు. అభ్యర్థులు పుట్టిన నక్షత్రం, పేరు ఆధారంగా నామినేషన్ దాఖలుకు ముహూర్తాలు ఖరారు చేస్తున్నట్లు పండితులు, సిద్ధాంతులు వెల్లడిస్తున్నారు. దీంతో పాటు నామినేషన్ పత్రాలను తమ కులదైవం ఎదుట ఉంచి పూజలు నిర్వహించి, పెద్ద ల ఆశీస్సులు తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ నెల 18, 19, 22, 23, 24 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతుండడంతో ఇప్పటికే జిల్లాలోని ప్రధాన పార్టీల నాయకులు తాము నామినేషన్ దాఖలు చేసే తేదీలను ప్రకటిస్తున్నారు. జాతకంలో రవి, కుజ గ్రహాలు బలంగా ఉంటే విజ యావకాశాలు మెండుగా ఉంటాయని పండితులు చెబుతుండడంతో ఆ సమయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. ప్రధానంగా ముస్లిం అభ్యర్థులు శుక్రవారం రోజున నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. మరికొందరు సర్వమత ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

శుభ ముహూర్తం అవసరం



అనుకున్న పనిలో విజయం సాధించాలంటే శుభముహూర్తం అవసరం. రానున్న సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు 18, 19, 22, 23, 24 తేదీలలో శుభ ముహూర్తాలు ఉన్నాయి. నక్షత్రం, పేరు ఫలాల ఆధారంగా శుభగడియలు నిర్ణయించవచ్చు. ఆయా ముహూర్తాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇష్ట దైవాలను కొలిచి ముందుకు సాగితే శుభ ఫలితాలు తప్పక సిద్ధిస్తాయి.

– డాక్టర్ టీ.బ్రహ్మాచార్యులు, పండితులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, వేదిక్ వర్సిటీ, తిరుపతి

వాహనం దగ్ధం

డక్కిలి: ప్రమాద వశాత్తు ఓ టాటా మ్యాజిక్ వాహనం దగ్ధమైన సంఘటన డక్కిలి మండలంలోని కందలవారిపల్లి నర్సరీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం.. గూడూరుకు చెందిన కే.పెంచలయ్య వెంకటగిరి పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. టాటా మ్యాజిక్ వాహనం నడుపుకుంటూ పట్టణంలోని ఓ పాఠశాల విద్యార్థులను ఇంటికి తీసుకువస్తుంటాడు. అయితే బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో వెంకటగిరి నుంచి రాపూరుకు ప్యాసింజర్లను తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అత్తగారి గ్రామమైన మార్లగుంటలో భోజనం చేసుకుని సాయంత్రం వెంకటగిరికి వెళ్తుండగా కందలవారిపల్లి నర్సరీ వద్దకు వచ్చే సరికి వాహనంలో ఒక్కసారిగా మంటల వ్యాపించాయి. పెంచలయ్య ఆటో నుంచి అతి కష్టం మీద బయటపడ్డాడు. వాహనంలో ఎవరూ ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఐదు నెలలు క్రితం టాటా మ్యాజిక్ వాహనాన్ని కొనుగోలు చేశాడు.

వైఎస్సార్‌సీపీ దూకుడు

- అధికార పార్టీలోకి వెల్లువెత్తుతున్న వలసలు
- చిన్నగొట్టిగల్లు, పాకాల మండలం నుంచి పెద్ద సంఖ్యలో చేరికలు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


చంద్రగిరి : చిట్టిచెర్లకు చెందిన టీడీపీ నాయకులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


గాధంకి టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తూ..

తిరుపతి రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ దూకుడు పెంచింది. అధికార పార్టీలోకి వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు వెల్లువలా తరలివస్తుండడంతో క్యాడర్‌లో జోష్ నింపింది. బుధవారం చంద్రగిరి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి టీడీపీలో కొనసాగిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి అధికార పార్టీలో చేరారు. ఇందులో చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచర్ల పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు డీ.చిన్నస్వామి, డీ.కుమార్‌స్వామి, పీ.ప్రసాద్, యం.సురేంద్ర రెడ్డి, వెంకట్రామిరెడ్డి, తాతిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, చంద్ర, శంకర్‌తో పాటు 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. తుమ్మలగుంటలో వీరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బోడిరెడ్డిగారిపల్లి, డక్కావాండ్లపల్లి గ్రామాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పాకాల మండలంలో....

పాకాల మండలం, గాధంకి పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి తుమ్మలగుంటలో తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డిమోహిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ కార్యకర్తలు బట్టు లక్ష్మణ్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, భాస్కర్ ఉన్నారు. పాకాల మార్కెట్ యార్డు డైరెక్టర్ బట్టు రుకేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బట్టు దామోదర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బట్టు నితిన్‌రెడ్డి, కార్తీక్, రమేష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, బానుచంద్ర, బట్టు గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కీలకనేత వైఎస్సార్‌సీపీలో చేరిక


వరదయ్యపాళెం : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ కీలకనేత ప్రభాకర్ నాయుడు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మండల ప్రచార కన్వీనర్ చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీల ఇన్‌చార్జ్ దోనిపర్తి భాస్కర్, స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, ఉపసర్పంచ్ నాని ఉన్నారు.


ఏర్పేడు : కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

ఏర్పేడు: మండలంలోని కందాడు పంచాయతీ పరిధిలోని సదాశివపురంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, శేఖర్‌రాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. టీడీపీకి చెందిన రామచంద్రరాజు ఆయన అనుచరులకు శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కుప్పాల వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, మణిరెడ్డి, నాగరాజురెడ్డి, పెన్నగడం శ్రీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన కార్యకర్తలు


కోట : వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలతో మేరిగ మురళీధర్, నాయకులు

కోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేన మాజీ మండల కన్వీనర్ హరీష్‌తో పాటు జనసైనికులు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వినోద్‌కుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, వంశీక్రిష్ణారెడ్డి, ఉపసర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

పాత దొంగల అరెస్ట్

తిరుపతి క్రైమ్: బస్సు, ఆటోలో ప్రయాణించే ప్రజలను ఏమార్చి బ్యాగులు మాయం చేసే ముగ్గురు పాత దొంగలను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. వివరాలు.. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ రద్దీ ప్రాంతాలలో వాహనాలలో ప్రయాణించే వారిని టార్గెట్ చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులను హరేరామ హరే కృష్ణ రోడ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నంద్యాలకు చెందిన వెట్టి లక్ష్మి అలియాస్ సింధే(35), వనర్సి జ్యోతి(21), ఓనర్జీ జాషువా ఉన్నారు. వీరు ముగ్గురూ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారు. వీరంతా గతంలో పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించారు. వీరి వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే 284 గ్రాముల బంగారును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఏర్పేడు: మండలంలోని పంగూరు ఎస్టీ కాలనీకి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. పంగూరు ఎస్టీ కాలనీలో ఓ బాలిక ఈ నెల 15 తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. 16వ తేదీ ఉదయం బాలిక ఇంట్లో కనబడకపోవడంతో బంధువుల ఇళ్లల్లో గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

కోట: మండలంలోని కేసవరం వద్ద మంగళవారం రాత్రి ఆటో ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్ఐ నాగబాబు కథనం మేరకు.. గూడూరుకు చెందిన దీవెనమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి మల్లాంకు వచ్చి తిరిగి ఆటోలో ఇంటికి వెళుతోంది. కేసవరం వద్ద ఎదురుగా వచ్చిన మరో ఆటో ఆమె చేతిని బలంగా ఢీకొంది. దీంతో ఆమె చేయి పూర్తిగా తెగి పడింది. ఆమెను గూడూరుకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం చెన్నైకి తీసుకెళ్లారు.

మహిళ ఆకస్మిక మృతి


మణెమ్మ (ఫైల్)

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరుకు చెందిన పోతురాజు మణెమ్మ(38) ఆకస్మికంగా మృతిచెందారు. ఆమె భర్త సుధాకర్ 15 ఏళ్ల కిందట మృతి చెందాడు. ఆమె ఇద్దరు కుమార్తెలున్నారు. అపాచీ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆదివారం పరిశ్రమకు వెళ్లి వచ్చిన తర్వాత ఒక్కసారిగా అస్వస్థకు గురైంది. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల రోదనలు చూపరులకు కన్నీళ్లు తెప్పించాయి.